సాక్షి ఆదిలాబాద్

మంగళవారం | 1 | జూలై | 2025



ఎరువుల కోసం పడిగాపులు
సాగు పనులు ఊపందుకుంటున్న తరుణంలో యూరియా, డీఏపీ కోసం రైతులకు పడిగాపులు తప్పడం లేదు. 8లో▸



వానాకాలం జర భద్రం
అసలే వర్షాకాలం. విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉంటాయి. లూజ్‌వైర్లు, నేలకొరిగే విద్యుత్ స్తంభాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
30.0/24.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

5వ తేదీలోగా రిపోర్టు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సీటు పొందిన వారు ఈనెల 3లోగా సెల్ఫ్ రిపోర్టు చేసుకోవాలని, కళాశాలలో 5వ తేదీలోగా రిపోర్టు చేయాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రఘు గణపతి తెలిపారు. ఒకటి, రెండు, మూడో విడతల్లో సీటు పొంది కూడా అడ్మిషన్ పొందని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని ఆయన సూచించారు.

జీపీ కార్మికుల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు సోమవారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి కిరణ్ మాట్లాడారు. మూడు నెలలుగా వేతనాలు అందక కార్మికులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం డీపీవో రమేశ్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఇందులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోపన్‌రావు, వెంకట్రావు, అశోక్, లస్మన్న పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట లంబాడాల ధర్నా



పిల్లలతో కలిసి ధర్నా చేస్తున్న లంబాడాలు

లంబాడాలకు 1977 ఓటరు జాబితా ఆధారంగా కుల ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందులో లంబాడా హక్కుల పోరాట సమితి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్ చౌహాన్, నాయకులు జాదవ్ కృష్ణ, రాథోడ్ రోహిదాస్, జాదవ్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అగ్రికల్చర్ కళాశాలలో యూజీ కోర్సుల్లో కంబైన్డ్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల డీన్ శ్రీధర్ చౌహాన్ ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. అగ్రికల్చర్ బీఎస్సీ హోమ్ సైన్స్, బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, బ్యాచ్‌లర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ (బీవీఎస్సీ) బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిషరీ సైన్స్ (బీఎఫ్ఎస్సీ), బీఎస్సీ హార్టికల్చర్ తదితర కోర్సులు ఉన్నట్లు తెలిపారు. వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

కనిపించే దైవం



- పేదలకు సేవే పరమావధిగా.. ఆదర్శం ఈ డాక్టర్లు
- నేడు జాతీయ వైద్యుల దినోత్సవం

వైద్యో నారాయణ హరి అంటుంటారు.. అందుకే దాక్టర్లను కనిపించే దైవంగా భావిస్తారు. దేవుడు ప్రత్యక్షమవుతాడో లేదోగాని అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వైద్యం అందించి ప్రాణదాతగా నిలుస్తుంటారు వైద్యులు. కొంతమంది వృత్తిని దైవంగా భావించడంతో పాటు సామాజిక సేవలోనూ రాణిస్తున్నారు. సొంత ప్రాంతంపై మమకారం చాటుతున్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో అలాంటి వారిపై ప్రత్యేక కథనం.

– ఆదిలాబాద్‌టౌన్



రిమ్స్‌లో శస్త్రచికిత్స చేస్తున్న డాక్టర్ కార్తీక్ (ఫైల్)

18 నెలల్లోనే 1600 శస్త్రచికిత్సలు



డాక్టర్ కార్తీక్

రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో యూరాలజిస్ట్‌గా సేవలిందిస్తున్న డాక్టర్ కార్తీక్ విధుల్లో చేరిన 18నెలల్లోనే 1600 శస్త్రచికిత్సలు చేశారు. ప్రైవేట్‌లో రూ.లక్షల ఖర్చుతో కూడిన క్రిటికల్ ఆపరేషన్లు సైతం విజయవంతంగా పూర్తి చేసి అందరి మన్ననలు అందుకుంటున్నారు. ఈయనది బోథ్ మండలంలోని కన్గుట్ట గ్రామం. తండ్రి పోశెట్టి రిటైర్డ్ ఎంఈవో, తల్లి పుష్పలత గృహిణి. ఇదివరకు హైదరాబాద్‌లోని యశోదలో నాలుగేళ్ల పాటు పనిచేశారు. జిల్లా వాసులకు వైద్యసేవలు అందించాలనే తన తండ్రి కోరిక మేరకు రిమ్స్‌లో విధులు నిర్వర్తిస్తున్నట్లు చెబుతున్నాడు ఈయన. డబ్బే ముఖ్యం కాదని.. ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ఈ వృత్తిని ఎంచుకున్నానని, అదే స్ఫూర్తిగా ముందుకు సాగుతున్నట్లు చెబుతున్నాడు. ఇప్పటివరకు కిడ్నీ స్టోన్స్, మూత్రాశయ క్యాన్సర్, ప్రొటెస్టేడ్ సమస్యలు, ఆర్ఐఆర్ఎస్ వంటి తదితర అరుదైన శస్త్ర చికిత్సలు చేశారు. ఈయన భార్య రోషిని నిర్మల్ మెడికల్ కళాశాలలో ఈఎన్‌టీగా సేవలందిస్తున్నారు.

గ్రామాన్ని దత్తత తీసుకున్నారు..



వైద్య దంపతులు అశోక్, రమను సన్మానిస్తున్న అంకాపూర్ గ్రామస్తులు (ఫైల్)

జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ అశోక్ రిమ్స్‌లో సూపరింటెండెంట్‌గా సేవలు అందిస్తున్నారు. ఈయన సతీమణి డాక్టర్ రమ గైనకాలజిస్ట్. జిల్లా కేంద్రంలో వీరు సీనియర్ వైద్యులు. వృత్తిపరంగా కాకుండా సామాజిక సేవలోనూ వీరు ముందు నిలుస్తున్నారు. రెండేళ్లుగా ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అంకాపూర్ గ్రామాన్ని దత్తత తీసుకొని ఆ పల్లెవాసులకు స్థానికంగా నాణ్యమైన వైద్యసేవలను ఉచితంగా అందిస్తున్నారు. రక్త పరీక్షలు, స్కానింగ్, ఓపీ తదితర సేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అలాగే టీబీ పేషెంట్లను ఐదుగురిని దత్తత తీసుకొని ఆరు నెలల పాటు వారికి పోషకాహారం ఉచితంగా అందిస్తున్నారు. రిమ్స్ మార్చురీ ఎదుట షెడ్‌తో పాటు కుర్చీలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని సాధన మానసిక వైకల్యం గల కేంద్రంలో ప్రతినెలా పిల్లలకు భోజనం అందిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో గల సత్యసాయి నిత్యాన్నదాన కేంద్రంలో రోగుల బంధువులకు నెలకోసారి భోజనం అందజేస్తూ దాతృత్వం చాటుతున్నారు.

పేషెంట్లు పూర్తయ్యే వరకూ..



కళ్యాణ్‌రెడ్డి

జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న జైనథ్ మండలం దీపాయిగూడ గ్రామానికి చెందిన నూతుల కళ్యాణ్‌రెడ్డి రేడియాలజిస్ట్‌గా సేవలందిస్తున్నారు. ఎలాంటి ప్రైవేట్ ప్రాక్టీస్ చేయరు. ఉదయం 9 గంటలకు విధులకు హాజరవుతారు. సమయంతో సంబంధం లేకుండా పేషెంట్లు పూర్తయ్యేంత వరకు సేవలందిస్తారు. స్కానింగ్, సేవల కోసం నిత్యం 300 నుంచి 400 మంది ఇక్కడికి వస్తుంటారు. ఏరోజుకు ఆరోజు నిర్ధారణ పరీక్షలు చేయడంతో పాటు రిపోర్టులు సైతం అందిస్తూ రోగులు ఇబ్బందులు పడకుండా చూస్తున్నారు. సేవలకు గుర్తింపుగా పలు అవార్డులు సైతం అందుకున్నారు.

ఢిల్లీ వదిలి.. రిమ్స్‌కు వచ్చి



డాక్టర్ ఆడె విఠల్

ఉట్నూర్ మండలం పులిమడుగు గ్రామానికి చెందిన పార్వతి–శ్రీరాముల దంపతుల కుమారుడు డాక్టర్ ఆడె విఠల్ జనరల్ రిమ్స్‌లో నాలుగేళ్లుగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నాడు. ఈయన వరంగల్‌లోని కేఎంసీలో వైద్యవిద్య అభ్యసించగా, ఢిల్లీలో పీజీ పూర్తి చేశాడు. అక్కడే అంబేద్కర్ ఆస్పత్రిలో వైద్యుడిగా సేవలు అందించాడు. జిల్లా ప్రజలకు వైద్యసేవలందించాలని తండ్రి కోరిక మేరకు రిమ్స్‌లో వైద్యుడిగా చేరి ఈ ప్రాంతంపై మమకారం చాటుతున్నాడు.

పీడీపీఎస్.. అమలయ్యేనా?

- పత్తి కొనుగోళ్లపై కేంద్రం నూతన విధానం
- ఆదిలాబాద్‌లో ఈ సీజన్ నుంచే పైలట్ ప్రాజెక్టుగా..
- ఇక వ్యాపారులే కొంటారు..
- ఎంఎస్‌పీ కంటే తక్కువ ఉంటే ఆ వ్యత్యాసాన్ని సీసీఐ ద్వారా రైతులకు చెల్లింపు
- ప్రస్తుత విధానమే మేలంటున్న కాటన్ అసోసియేషన్



న్యూఢిల్లీలో ఇటీవల నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆదిలాబాద్ మిల్లు వ్యాపారి మనీష్ మాల్పాని

సాక్షి,ఆదిలాబాద్: ధర వ్యత్యాస చెల్లింపు పథకం (పీడీపీఎస్)ను పత్తి కొనుగోళ్ల పరంగా దేశంలో అమలు చేసేందుకు కేంద్రం సిద్ధమవుతుంది. రాష్ట్రంలో ఈ పథకాన్ని ప్రయోగాత్మకంగా ఆదిలాబాద్ మార్కెట్‌లో ఈ సీజన్ నుంచే అమలు చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇటీవల వెల్లడించారు. ఈ నేపథ్యంలో సాధ్యాసాధ్యాలపై చర్చ మొదలైంది.

పీడీపీఎస్ అమలైతే..
భారత పత్తి సంస్థ (సీసీఐ) పత్తిని కొనుగోలు చేయదు. మార్కెట్లో వ్యాపారులు మాత్రమే రైతుల నుంచి విక్రయిస్తారు. అలాంటప్పుడు ఇక సీసీఐ ఉంటుందా.. కనుమరుగవుతుందా అనే సందేహాలు రావచ్చు. అయితే కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కంటే రైతులకు మార్కెట్లో తక్కువ ధర లభించిన పక్షంలో ఆ వ్యత్యాసాన్ని కేంద్రం భరిస్తుంది. సీసీఐ ద్వారా ఆ మొత్తాన్ని రైతుల ఖాతాల్లోకి జమ చేస్తోంది. అదే ఈ స్కీమ్ ఉద్దేశం. మార్కెట్లో ఎంఎస్‌పీ కంటే తక్కువ ధర ఉన్నప్పుడు రైతులకు ఆ వ్యత్యాసాన్ని చెల్లించడం ద్వారా వారికి నష్టం కలగకుండా చూడాలన్నదే ప్రభుత్వ భావన.

ఇటీవల నీతి ఆయోగ్ సమావేశంలో చర్చ..
జూన్ 19న న్యూఢిల్లీలోని నీతి ఆయోగ్ భవన్‌లో చైర్మన్ ప్రొఫెసర్ రమేశ్‌చంద్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో పీడీపీఎస్ అమలుతో ఎదురయ్యే ఇబ్బందులు, సవాళ్లపై చర్చించారు. నీతి ఆయోగ్, సీసీఐ ఉన్నతాధికారులు, వివిధ రాష్ట్రాల వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు, కాటన్ అసోసియేషన్ సభ్యులు, ఎంపిక చేసిన రైతులు పాల్గొన్నారు. జిల్లా నుంచి జిన్నింగ్ మిల్లు వ్యాపారి మనీష్ మాల్పాని, రైతు సంఘం నుంచి గోవర్ధన్ యాదవ్ పాల్గొన్నారు. ఈ స్కీమ్ అమలుకు సంబంధించి సాధ్యాసాధ్యాలపై నీతి ఆయోగ్ అందరి నుంచి అభిప్రాయ సేకరణ చేసింది. ఇందులో పాల్గొన్న తెలంగాణ కాటన్ అసోసియేషన్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు వరంగల్‌కు చెందిన బొమ్మినేని రవీందర్ రెడ్డి తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం సీసీఐ ద్వారా చేపడుతున్న కొనుగోలు విధానమే రైతులకు బాగుందని, ఇకముందు కూడా కొనసాగిస్తేనే మేలు చేకూరుతుందని స్పష్టం చేశారు. మరోపక్క రైతు సంఘం నాయకులు కూడా సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఆ వ్యత్యాస ధర రైతులకు ఎన్ని రోజుల్లో ప్రభుత్వం చెల్లిస్తుందని ప్రశ్నిస్తున్నారు.

ఆ మండలాల రైతులే అమ్మాలి..



పీడీపీఎస్ అమలైన పక్షంలో ఆదిలాబాద్ ఏఎంసీ నోటిఫైడ్ మండలాలైన తలమడుగు, తాంసి, భీంపూర్, ఆదిలాబాద్‌అర్బన్, ఆదిలాబాద్‌రూరల్, మావల రైతులు మాత్రమే మార్కెట్ యార్డులో పత్తిని విక్రయించాల్సి ఉంటుంది. ఇతర మండలాల రైతులు విక్రయించడానికి వీలుండదు. ఆదిలాబాద్ మార్కెట్లో ఉన్న వసతుల దృష్ట్యా ప్రస్తుత విధానంలో అటు వ్యాపారులు కొనుగోలు చేసినా, ఇటు సీసీఐ కొనుగోలు చేసినా ప్రతిరోజు రూ.20కోట్ల వరకు వ్యాపారం జరుగుతుంది. ప్రధానంగా జిల్లాలోని అన్ని మండలాల నుంచే కాకుండా, పక్క జిల్లాలోని కొన్ని మండలాల నుంచి రైతులు ఆదిలాబాద్ మార్కెట్‌కు వచ్చి పత్తిని విక్రయిస్తారు.

– గోవర్ధన్ యాదవ్, రైతు సంఘం నాయకుడు

ప్రస్తుత విధానమే మేలు..



న్యూ ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ కాటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రధానంగా ప్రస్తుత కొనుగోలు విధానమే రైతులకు మేలని స్పష్టం చేయడం జరిగింది. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ సీజన్ నుంచి తప్పనిసరిగా ఈ స్కీమ్ అమలు చేయాలనే లక్ష్యంతో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఇప్పటికీ కేంద్రానికి హామీ ఇవ్వలేదని మా దృష్టిలో ఉంది. ప్రధానంగా వ్యాపారుల వద్ద డబ్బులు ఉన్నంతవరకు పత్తిని కొనుగోలు చేయగలుగుతారు. ఆ తర్వాత వ్యాపారులు కొనుగోలు చేయకపోతే రైతుల పరిస్థితి ఏంటి. ఈ నేపథ్యంలోనే సీసీఐ కూడా కొనుగోలు చేస్తేనే రైతులకు మేలు జరుగుతుంది.

– మనీష్ మాల్పాని,జిన్నింగ్ మిల్లు యజమాని

సాధ్యాసాధ్యాలు పరిశీలించాలి

ఆదిలాబాద్ వంటి పెద్ద మార్కెట్లో పైలట్ ప్రాజెక్ట్‌గా ఈ సిస్టమ్‌ను అమలు చేయాలనుకోవడం సరికాదు. మొదట ఓ చిన్న మార్కెట్లో అమలు చేసి దాన్ని సాధ్యాసాధ్యాలను పరిశీలించాలి. అలాంటప్పుడే లోపాలు తెలుస్తాయి.

– రాజు చింతవార్, వ్యాపారి

ఎలాంటి ఉత్తర్వులు అందలేదు..

పీడీపీఎస్ అమలు విషయంలో ఇప్పటివరకు మాకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. విధివిధానాలు ఖరారు కాలేదు. ఈ కొనుగోలు సీజన్ నుంచి ఈ విధానం అమలవుతుందా అని ఇప్పుడే చెప్పలేం. ప్రభుత్వాల నిర్ణయాల మేరకు ముందుకెళ్తాం.

– గజానంద్, జిల్లా మార్కెటింగ్ అధికారి

కలెక్టర్‌ను సన్మానించి .. కృతజ్ఞతలు తెలిపి

- ‘గ్రీవెన్స్’ సమస్య పరిష్కారంపై హర్షం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న డబ్బకుచ్చి గ్రామస్తులు

కైలాస్‌నగర్: ప్రజావాణిలో నివేదించిన సమస్య పరిష్కరించడంపై భీంపూర్ మండలం డబ్బకుచ్చి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు గ్రీవెన్స్‌కు వచ్చి కలెక్టర్ రాజర్షి షాను సత్కరించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల 15ఏళ్ల క్రితం మూతపడింది. దీంతో విద్యార్థులు మూడు కిలోమీటర్ల దూరంలోని వడ్‌గాంవ్‌కు వెళ్లి చదువుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో పలువురు చదువుకు దూరమవుతున్నారని, ఈ తీరుపై గ్రామస్తులు జూన్ 23న ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. మూతపడ్డ బడిని తెరిపించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆదేశించారు. మరుసటి రోజే గ్రామాన్ని సందర్శించిన విద్యాశాఖ అధికారులు పాఠశాలను పునఃప్రారంభించారు. కలెక్టర్ చొరవపై హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు సోమవారం ఆయన్ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. తమ గ్రామాన్ని సందర్శించాలని విజ్ఞప్తి చేశారు. కాగా పాఠశాలలో చదివే 30 మంది విద్యార్థులకు అవసరమైన 300 నోట్ బుక్స్‌ను పట్టణానికి చెందిన న్యాయవాది కె.విశ్వనాథ్ తన సమనుజ్ఞ ట్రస్ట్ ద్వారా కలెక్టర్ చేతుల మీదుగా వారికి అందజేశారు. ఇందులో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధలు విని.. భరోసా కల్పించి



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

- అర్జీలు స్వీకరించిన కలెక్టర్
- ప్రజావాణికి 98 దరఖాస్తులు

కైలాస్‌నగర్: ప్రజావాణిలో అందించే అర్జీలు పెండింగ్‌లో ఉంచకుండా సత్వరం పరిష్కరిస్తూ బాధితులకు భరోసా కల్పించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. తమ గోడు విన్నవించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన వారి నుంచి అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ సలోనిచాబ్రాతో కలిసి ఆయన అర్జీలు స్వీకరించారు. అనంతరం వాటిని సంబంధిత అధికారులకు అందజేస్తూ త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వారం వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 98 అర్జీలు అందాయి. అందులో కొందరి నివేదన..

కళాశాలలో ప్రవేశం కల్పించండి..



అయ్యా.. మేము ఉట్నూర్ మండలంలోని రాముగూడకు చెందిన కోలాం తెగ గిరిజనులం. మా బిడ్డలు ఇటీవల పదో తరగతి పాసయ్యారు. నైతం సోనిబాయికి 412 మార్కులు, కుమ్రం సీతాబాయికి 417 మార్కులు వచ్చాయి. గిరిజన సంక్షేమ ఆశ్రమ గురుకుల కళాశాలల్లో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేశాం. ఇటీవల జరిగిన కౌన్సెలింగ్‌లో సీటు దొరకలేదు. ప్రైవేట్‌లో వేలాది రూపాయలు పెట్టి చదివించే స్తోమత మాకు లేదు. మాపై దయచూపి గిరిజన ఆశ్రమ కళాశాలల్లో సీటు ఇప్పించాలి.

– నైతం భీంరావు, కుమ్రం లక్ష్మణ్, ఉట్నూర్

బడికి కొత్త భవనం మంజూరు చేయండి



సార్.. మా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 88 మంది విద్యార్థులు చదువుతున్నారు. రెండు గదుల్లోనే పాఠశాలను కొనసాగిస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరి తరగతుల నిర్వహణకు ఇబ్బందికరంగా మారింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మూడు గదులతో కూడిన నూతన భవనాన్ని మంజూరు చేయాలి.

– విమల, లక్ష్మి, మర్లపల్లి(గ్రా), బోథ్

మా పిల్లల చదువు ప్రశ్నార్థకంగా మార్చారు..

మేమంతా ఎస్సీ కులానికి చెందిన నిరుపేదలం.ప్రభుత్వం అమలు చేస్తున్న బెస్ట్ అవలైబుల్ స్కీం కింద మా పిల్లలకు సీటు రావడంతో మావల మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో చేర్పించాం. ప్రస్తుతం వారంతా 8,9,10వ తరగతి చదువుతున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదనే ఉద్దేశంతో యాజమాన్యం మా పిల్లలను పాఠశాలకు రానివ్వడం లేదు. నెల రోజులుగా వారు చదువుకు దూరమయ్యారు. ఇతర పాఠశాలల్లో చేర్పిద్దామన్న టీసీ, బోనఫైడ్ ఇవ్వడం లేదు. దీంతో మా పిల్లలు నష్టపోయే పరిస్థితి ఉంది. చొరవ చూపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.



ఇళ్ల జాబితా నుంచి తొలగించారు..



మేమంతా కూలీనాలి చేసుకుని జీవించే నిరుపేదలం. మాకు పక్కా ఇండ్లు లేవు. ప్రభుత్వమిచ్చిన స్థలంలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుండటంతో మా సమస్య తీరుతుందని ఎంతో సంతోషించాం. తొలుత అర్హుల జాబితాలో మా పేర్లు కూడా ఉన్నాయి. తర్వాత ఏమైందో తెలియదు కానీ అధికారులు మా పేర్లు తొలగించారు. ఇండ్లు ఉన్నవారికే మంజూరు చేస్తున్నారు. విచారణ జరిపించి మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

– బంగారుగూడ కాలనీవాసులు, ఆదిలాబాద్

బాధితుల సమస్యలు పరిష్కరించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



ఎస్పీకి సమస్యలు విన్నవిస్తున్న అర్జీదారులు

ఆదిలాబాద్‌టౌన్: బాధితుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 73 మంది అర్జీదారులు ఎస్పీని కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఆయా స్టేషన్ల అధికారులతో ఎస్పీ ఫోన్ ద్వారా మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యలు విన్నవించేందుకు నేరుగా రాలేని వారు వాట్సాప్‌నంబర్8712659973పై సంప్రదించవచ్చని సూచించారు. ఇందులో సీసీ కొండ రాజు, ఫిర్యాదుల విభాగం అధికారి కవిత, వామన్ పాల్గొన్నారు.

ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం చేయాలి

కైలాస్‌నగర్: జూలై 1నుంచి 31వరకు చేపట్టనున్న ఆపరేషన్ ముస్కాన్–11వ విడత కార్యక్రమాన్ని ఆయా శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో కార్యక్రమ నిర్వహణపై సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. బాలకార్మికులు కనిపిస్తే 1098కు వెంటనే సమాచారం అందించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఆదిలాబాద్, ఉట్నూర్ డివిజన్లలో ఒక్కో బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని ఇటుక బట్టీలు, వివిధ రకాల పరిశ్రమలు, బస్‌స్టేషన్లు, ట్రాఫిక్ జంక్షన్ల వద్ద క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటున్న పిల్లలను గుర్తించి తల్లిదండ్రుల వద్దకు చేర్చేలా చర్యలు చేపట్టాలన్నారు. బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలలు, హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లలో చేర్పించాలన్నారు. వివరాలను మిషన్ వాత్సల్య యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇందులో జిల్లా సంక్షేమాధికారి మిల్కా, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ ముత్యం రెడ్డి, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి , వివిధ ఎన్జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవో 49 రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న గిరిజన సంఘ నాయకులు

కైలాస్‌నగర్: ఆదివాసీలను అడవికి దూరం చేసేలా తెచ్చిన జీవో 49ను తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. పెసా వంటి గిరిజన చట్టాలు అమలు చేయకుండా ఎలాంటి గ్రామసభలు నిర్వహించకుండా తీసుకొచ్చిన జీవో 49ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో ఆదివాసీలు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల ధర్నా..
పెండింగ్ బిల్లులు విడుదల చేయాలనే డిమాండ్‌తో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు తెచ్చి వంట చేయాల్సి వస్తుందన్నారు. ఎన్నికల హామీ మేరకు రూ.10వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇందులో సంఘం నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి


లక్ష్మి (ఫైల్)

తలమడుగు: విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తలమడుగు మండలంలోని కజ్జర్ల గ్రామానికి చెందిన జువ్వాక లక్ష్మి (48) ఆదివారం రాత్రి ఇంట్లోకి సరఫరా అయ్యే విద్యుత్ తీగపై ఆరేసిన బట్టలు తీస్తుండగా షాక్‌కు గురికావడంతో కిందపడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు.

రాయితీ బియ్యం పట్టివేత


పట్టుబడిన రాయితీ సన్నబియ్యం

నార్నూర్: రాయితీ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి పేదలకు అధిక ధరలకు విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పీ.ప్రభాకర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం గాదిగూడ మండల కేంద్రంలో దాడులు నిర్వహించగా కూర శివాజీ దుకాణంలో 17.6 క్వింటాళ్లు, లోకారి-కే గ్రామంలో షేక్ జావిద్ కిరాణా దుకాణంలో 7.3 క్వింటళ్ల ప్రభుత్వ రాయితీ బియ్యం లభించినట్లు పేర్కొన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ ఛాంబర్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. ఇంద్రవెల్లి మండలం సమ్మక్క గ్రామానికి చెందిన భీంరావ్ కిరాణ దుకాణం, నార్నూర్ మండలం గుండాలకు చెందిన ప్రవీణ్ ల్యాబ్, రెబ్బెన మండలం ఖాజీగూడకు చెందిన చంద్రశేఖర్ టెంట్‌హౌస్ మంజూరు చేయాలని కోరారు. ఇంకా పింఛన్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన దరఖాస్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో (పీవీటీజీ) మెస్రం మనోహర్, డీడీ అంబాజీరావు, పీహెచ్‌వో సందీప్ కుమార్, ఏడీఎంహెచ్‌వో కుడిమేత మనోహర్, ఏవో దామోదరస్వామి, మనోహర్, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన ముగ్గురు అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కరుణాకర్‌రావు

ఆదిలాబాద్‌టౌన్: మత్తు పదార్థాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. సోమవారం టూటౌన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం తెల్లవారుజామున పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గుర్ని విచారించగా చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. శనివారం రాత్రి రిమ్స్ ఆస్పత్రి పక్కన గల సాయిసేవ ఆస్పత్రిలోని మెడికల్ షాపులో చోరీకి పాల్పడ్డారని, ఒక సెల్‌ఫోన్‌తో పాటు రూ.200 నగదు, టర్మైన్ ఇంజక్షన్లు, మెడజాలమ్ ఇంజెక్షన్లను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. మత్తుపదార్థాలకు అలవాటుపడిన వారు మత్తులో ఉండటానికి ఇలాంటి ఇంజక్షన్ల చోరీకి పాల్పడినట్లు వివరించారు. ఈనెల 22న మోయిజ్ మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో, 23న దస్నాపూర్‌లోని దుర్గామాత మందిరంలో, 28న సాయిఫాస్ట్ ఫుడ్ సెంటర్ పక్కన గల కిరాణ దుకాణంలో చోరీకి పాల్పడినట్లు తెలిపారు. అరెస్టు చేసిన వారిలో న్యూహౌజింగ్‌బోర్డుకు చెందిన మహ్మద్ మోయిజ్, చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ సమీర్, షేక్ అబ్దుల్ ఉన్నట్లు పేర్కొన్నారు.

జీవో 49 రద్దు చేయాలి


నిరసన తెలుపుతున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: టైగర్ రిజర్వ్ పేరుతో ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 49 వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆత్రం తనుష్, జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, నార్నూర్ మండల అధ్యక్షుడు మల్కు డిమాండ్ చేశారు. సోమవారం ఐటీడీఏ క్యాంపు కార్యాలయం ఎదుట టీఏజీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగోరావు, మహేష్, గణేశ్, వికాస్, నాందేవ్, తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడిన ముగ్గురు విలేకరుల అరెస్ట్

ఇచ్చోడ: రైతును బెదిరించి రూ.50 వేలు డిమాండ్ చేసిన ముగ్గురు విలేకరులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బండారి రాజు తెలిపారు. సోమవారం ఇచ్చోడ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నేరడిగొండ మండలంలోని సుర్జపూర్‌కు చెందిన టాగారే కాసాన్‌దాస్ మే 18న ఇంట్లో తన కూతురు పెండ్లి ఉండటంతో జొన్నలను సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆరబెట్టాడు. గమనించిన గాజుల దేవేందర్, షేక్ ఫసియొద్దీన్, గాజుల శ్రీకాంత్ ప్రభుత్వ పాఠశాల ఆవరణ లో జొన్నలను ఆరబెట్టడానికి అనుమతులు ఉన్నా యా అని బెదిరించి రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భయాందోళనకు గురైన రైతు రూ.30వేలు అందించాడు. సదరు రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సదరు విలేకరుల నుంచి రూ.18 వేలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో నేరడిగొండ ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: తాంసి మండలంలోని లీమ్‌గూడకు చెందిన టేకం భరత్ సోమవారం ఉదయం భుక్తాపూర్‌లోని విద్యుత్ కార్యాలయం ముందు నుంచి కాలినడకన వెళ్తుండగా ఆటో ఢీకొంది. దీంతో ఆయన తలకు గాయమైంది. బాధితుడి భార్య టేకం అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

బైక్‌ల దొంగ అరెస్ట్


నిందితుడు, బైక్‌లతో సీఐ కరుణాకర్‌రావు

ఆదిలాబాద్‌టౌన్: ద్విచక్ర వాహనం దొంగలించిన ఆదిలా బాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన షేక్ నదీమ్‌ను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన మహ్మద్ షాబాద్‌ఖాన్ ఏప్రిల్ 11న బస్టాండ్‌లో పల్సర్ బైక్ పార్కింగ్ చేసి నిర్మల్‌కు వెళ్లాడు. రాత్రి 9 గంటలకు తిరిగి వచ్చిన ఆయన బైక్ కనిపించకపోవడంతో 15న టూటౌన్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం ఇందిరానగర్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పట్టుకుని విచారించగా రెండు బైక్‌లు చోరీ చేసినట్లు తెలిపాడు. నిందితుడిపై ఇదివరకే రూరల్ పోలీసుస్టేషన్‌లో 2, టూటౌన్‌లో 2 చోరీ కేసులు ఉన్నట్లు చెప్పారు.

ఆదివాసీలను అడవుల నుంచి దూరం చేయొద్దు

- కేంద్ర మంత్రికి విన్నవించిన 'సోయం'


వినతిపత్రం ఇస్తున్న సోయం బాపూరావు

కైలాస్‌నగర్: ఆదివాసీలను అడవుల నుంచి దూరం చేసేలా జారీ చేసిన జీవో 49 రద్దు చేయాలని మాజీ ఎంపీ సోయం బాపూరావు కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జుయల్ ఓరామ్‌ను కోరారు. సోమవారం న్యూఢిల్లీలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణలో ఆదివాసీల సమస్యలు, పోడు భూములకు పట్టాలు, జీవో 49 అంశాలపై మంత్రితో చర్చించి వినతిపత్రం అందజేశారు హరితహారం పేరిట పోడు భూముల్లో మొక్కలు నాటడం మానుకోవాలని కోరారు. టైగర్ కన్జర్వేషన్ పేరిట ఆసిఫాబాద్ జిల్లాలోని ఆదివాసీలను అడవుల నుంచి దూరం చేసేందుకు అటవీ అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు. గిరిజనులు, గిరినేతలు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు అందించేలా చూడాలని విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి త్వరలోనే తెలంగాణలో పర్యటించి గిరిజనుల స్థితిగతులను పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఆర్జీయూకేటీలో అకడమిక్ రివ్యూ మీటింగ్


మాట్లాడుతున్న ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర: బాసర ఆర్జీయూకేటీలో 2025-26 విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం అకడమిక్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ప్రొఫెసర్ ఏ.గోవర్ధన్, ఓఎస్‌డి ప్రొఫెసర్ ఈ. మురళీదర్శన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థుల హాజరు, రిజిస్టర్ల నిర్వహణ, డేటా భద్రతపై దృష్టి పెట్టాలన్నారు. ఎన్ఏఏసీ ఫైల్ తయారీపై అన్ని శాఖల అధ్యాపకులు శ్రద్ధ వహించాలని సూచించారు. త్వరలో (ఎంటెక్)పీహెచ్‌డీ ప్రవేశ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. బాసర, మహబూబ్ నగర్ సెంటర్లకు సంబంధించిన ప్రవేశ ఫలితాలు విడుదల జూలై 4న, జూలై 7, 8, 9 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ ఫలితాలను మొదటిగా విడుదల చేసిన విశ్వవిద్యాలయంగా బాసర ఆర్జీయూకేటీ నిలిచిందన్నారు. ఇందులో భాగమైన టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో డీన్లు డాక్టర్ మహేష్, డాక్టర్ విట్టల్, డాక్టర్ నాగరాజు, అన్ని విభాగాల హెచ్ఓడీలు, పీఆర్‌వో విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా, డీఏపీ కోసం రైతుల పడిగాపులు


బజార్ హత్నూర్‌లో యూరియా కోసం గుమిగూడిన రైతులు

బజార్‌హత్నూర్/తాంసి: బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయానికి 60 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలియడంతో ఉదయం 5 గంటల నుంచి రైతులు బారులు తీరారు. మండలానికి 2వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటి వరకు 500 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని, మంగళవారం మరో 60 మెట్రిక్ టన్నులు వస్తుందని ఏవో ఎండీ సాద్ తెలిపారు. తాంసి మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం సొసైటీలో సోమవారం డీఏపీ పంపిణీ చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఉదయమే సొసైటీ కేంద్రానికి చేరుకున్నారు. సుమారు 200 మందికి పైగా రైతులు డీఏపీ కోసం క్యూలో వేచి ఉన్నారు. సొసైటీ కేంద్రంలో మాత్రం కేవలం 200 బ్యాగులు మాత్రమే ఉండడంతో ముందు వరుసలో ఉన్నవారికే బస్తాలు దొరికాయి. దీంతో ఆగ్రహించిన రైతులు ఆందోళనకు దిగారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి సరిపడా ఎరువులు అందించాలని తాంసి, బజార్ హత్నూర్ మండలాల రైతులు కోరుతున్నారు.